# అక్కడ- ఇక్కడ

అక్కడ ఉన్నదీ పచ్చపచ్చని ఎర్రయెర్రని నేలే. తెల్ల తెల్లని నీలినీలి నింగే.

ఇక్కడ ఉన్నదీ తెల్లతెల్లని, నీలినీలి నింగే. పచ్చ పచ్చని, ఎర్రయెర్రని నేలే.

అక్కడ ఉన్నదీ ప్రజలే. వాళ్లకున్నవీ కష్టసుఖాలే. ఇక్కడ ఉన్నదీ జనమే. వీళ్లకున్నవీ సుఖదుఃఖాలే.



అక్కడ వివిధ మతాల వారున్నారు. ఇక్కడ వివిధ మతాల వారున్నారు. అక్కడ బిడ్డ పుట్టగానే మత విద్వేషం ఉగ్గుపాలతో పడతారు. చిన్నప్పటించీ క్లాసుపుస్తకాల్లో మత దురభిమానం గురించి రాస్తారు. పరమత ద్వేషం పాఠాలు నూరిపోస్తారు.

ఇక్కడ పరమత సహనం గురించి చెబుతారు. అలాంటి కథలల్లుతారు. అన్ని మతాల సారం ఒకటేనంటారు.

అక్కడ రాజకీయ నాయకులు వేదికలెక్కి ఇతర మతాలను ఆడిపోసుకుంటారు. తమ మతమే గొప్ప దంటారు.

ఇక్కడ రాజకీయ నాయకులు వేదికలెక్కి ఇతర మతాలను ప్రశంసిస్తారు. మత సామరస్యం మాట మరవొద్దంటారు.

అక్కడ చట్టాన్ని నిర్దేశించేది మతం. అదే అక్కడి నేతల అభిమతం.

ఇక్కడ చట్టాన్ని ఇచ్చింది వలస పాలకులు. అదే ఇక్కడి నేతలకు అనుసరణీయం.

అక్కడ మత ప్రవక్తలు వల్లించిందే రాజ్యాంగం. వాళ్లంటే ఎంతో భక్తి.

ఇక్కడ మరోమతం స్వీకరించిన వ్యక్తి రచించిందే రాజ్యాంగం. ఆయన పట్ల ఎనలేని గౌరవం.

అక్కడ టీవీలో తమ ఒక్క మతం గురించే ప్రసారం చేస్తారు. ఇతర మతాలకూ వాటి నాయకులకూ అవకాశం లేదు. అల్ప సంఖ్యాకులు వాళ్ల దృష్టిలో అల్పజీవులు.

ఇక్కడ టీవీలో అన్ని మతాల గురించీ ప్రసారం చేస్తారు. అన్ని భాషల కార్యక్రమాలనూ ప్రసారం చేస్తారు. హైదరాబాద్ టీవీలో అయితే, తెలుగు వార్తలు అవగానే అవే ఫొటోలు, వార్తల్ని ఉర్దూలో కూడా చూపిస్తారు. అయినా, వీటిని ఈ అధిక సంఖ్యాకులు సహనంతో చూస్తారు.

అక్కడ మైనార్టీలు ఏ అధికార సంస్థకూ అధినేత కాలేదు. దేశం తరపున ధేనికీ నాయకత్వం వహించలేదు. మంత్రులు కాలేరు.

ఇక్కడ మైనార్టీలు ఏ అధికార సంస్థకైనా అధినేత కాగలరు. దేశం తరపున క్రికెట్ వంటి టీమ్‌లకు నాయకత్వం వహించగలరు. మంత్రులు కాగలరు.

కె.వి.యస్.వర్మ ఫీచర్స్

అక్కడ దేశ ప్రధానిని అధికారం నుంచి తొలగించడానికి,ఏవో కుట్రకేసులు సాకుతో సైన్యం అండతో ఉరి తీయించగలరు. సైనిక పాలన సర్వసామాన్యం.

ఇక్కడ దేశ ప్రధానిని ఎన్నికల ద్వారానో అభిశంసన ద్వారానో తప్ప అధికారం నుంచి తొలగించరు.

అక్కడ మైనార్టీలు అయిన హిందువులు, క్రిస్టియన్లు ఎన్నికల్లో ముస్లిం అభ్యర్థులకు ఓటు వేయలేరు. దానికి రాజ్యాంగం వీలు కల్పించదు.

ఇక్కడ మైనార్టీలు అయిన ముస్లింలు, క్రిస్టియన్లు తమ కిష్టమయిన అభ్యర్థికి ఓటు వేయగలరు. దీనికి రాజ్యాంగం వీలుకల్పిస్తుంది.

అక్కడ 217 సీట్లున్న పార్లమెంటు దిగువ సభకు కేవలం పది మందిని మాత్రమే ముస్లింయేతర ఓటర్లు ఎన్నుకోవాలి. అంటే పది మంది మైనార్టీ అభ్యర్థులు మాత్రమే పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశంవుంది. ఇక పార్లమెంటులో శక్తివంతమైన ఎగువసభకు మైనార్టీలు పోటీ చేయడానికి ఏమాత్రం అవకాశం లేదు.

ఇక్కడ పార్లమెంటు దిగువ సభకయినా, ఎగువ సభకయినా ఏ రాష్ట్ర అసెంబ్లీకయినా మైనార్టీలు పోటీ చేయవచ్చు. అధికారంలో పాలుపంచుకోవచ్చు.

అక్కడ, ఇక్కడ ఇలా ఇన్నో తేడాలున్నాయి అక్కడ పాకిస్తాన్, ఇక్కడ భారత్.

అయితే, ఇక్కడ రథంపై నడుస్తున్న పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం వస్తే అక్కడ, ఇక్కడ తేడాలుండకపోవచ్చు. అప్పుడు, అక్కడ ఇక్కడే!

11.10.93

ఆంధ్రభూమి దినపత్రిక